# టోపీదాస్ First—Campaign మొదటిదండయాత్ర.

డి. గోపాలకృష్ణారావు. బి. ఏ.



అది పుష్యబహుళ అమావాశ్యఆదివారం. బాలభానుఁడు తూర్పుకొండపై బొడసూపి తన సహస్ర కిరణములతో వృక్షాగ్రముల సౌధాగ్రముల బంగారు పూతబూయుచుండెను. పిల్లతెమ్మెరలు చల్లగా వీచుచుండెను. వికసితకమలములు కమలాప్తునకు స్వాగతమిచ్చుచుండెను. కాకినాడ రైల్ టవున్ స్టేషన్‌నుండి రెండుఫర్లాంగుల పొడవున ప్యాసింజరు రైలు పోర్టుస్టేషన్‌కు జనులతో కిటకిటలాడుచు పెడబొబ్బలిడుచు పరుగిడుచుండెను. కాకినాడవీధులగుండా జనులు బహు ఉత్సాహముతో దక్షిణాభిముఖులై వరుసలుదీరి నడచుచుండిరి. ముందు పురుషులు వారివెనుక పసిబిడ్డలచంకనిడికొని స్త్రీలు విశ్రామములేక నతిరయోదార్యముగా బోవుచుండిరి. పూర్వసువాసినులు గుడ్డమూటల చంకబెట్టుకొని హుటాహుటి నడచి పోవుచుండిరి. అమావాశ్యయనువారు - ఆదివారమను వారు- అర్ధోదయ మనువారు - పర్వదినమనువారు— చొల్లంగితీర్థమనువారు - తొమ్మిదిన్నరగంటకే యనువారు - పదపదయనువారు - రండిరండి

యనువారు పైనుండు అలకల్లోలముగా నుండెను. రెండెడ్లబండ్లు రెండు మూడు ఫర్లాంగుల వరకు వరుసతప్పక నెమ్మదిగా బోవుచుండ నందలి జనులత్యాతురత సూచకంబులైన పరుష వాక్యముల బండ్లతోలువారిని మందలించుచుండిరి. బండ్లవాండ్లెంతవాడించిన సరకుచేయక ఎడ్లు తప్పుకొనుటకు స్థలము చాలనందున కదలుటకరించి నిలబడిపోవుచుండెను. మధ్యమధ్య నంబెద్దుబండ్లు, గుఱ్ఱంబండ్లు నిలబడి మనుష్యుల లెక్కచేయక మీదికి ధుముకుచుండెను. కొందఱు శక్తిబొమ్మల నెత్తిపై నిడికొని నాగుబాముల మూపులబెట్టుకొని వీరంగవాద్యములతో నాడలెరుంగక ధూపపరిమళము లపారవశ్యతచే గంతులిడుచు సాగిపోవుచుండిరి. గణాచారులావేశముఖులై నర్తనముచేయుచుండిరి. జనము ధికమగుటచే చొల్లంగి రేవంతయు బురదతో నిండిపోయెను. కొందఱు స్త్రీలందు కూరుకొనిపోగా బలవంతముమీద వారిని పైకి లాగుచుండిరి. బురదలో స్నానమాడ వెరచి కష్టములకోర్చి నావలవారికి సుంకమర్పించుకొని పడవలపై వెళ్లి సాగరసంగమ స్నానమొనరించి కొందఱు వచ్చుచుండిరి. వీరి యప్పటి యవస్థ పగవారికైనా వలదనిపించుచుండెను. నావలు తంక్రిందాటచే కొందఱు ప్రాణభీతిచే పరితపించుచుండిరి. పిల్లలు తప్పిపోవుచుండిరి. స్త్రీలు తమ మగవారిని కలిసికొనలేక నటునిటు పరుగిడుచుండిరి. తప్పిపోయిన తమ వనితలకై మగవారు వెతికి వెతికి వేసారుచుండిరి.

ఇట్టికల్లోలసమయమునను మనటోపీదాసుగారు పరివారసహితుడై - ప్రచారము మొదలిడెను - కుడిప్రక్క జాధ్యాలశాస్త్రి యెడమ ప్రక్క శంభన్న వెనుక రిజర్వులో బద్ధభైరవాచార్యుడు తన్ను పరివేష్టింప 'జయాభి జయభవ' అని జయజయ ధ్వానములతో చెన్నారుచుండెను. మన టోపీదాసుకు "నెరజాణ" దర్శనము కాలేదు. వీని నిక్కులు టక్కులు జాధ్యాల శాస్త్రి నక్కవినయాలు, శంభన్న స్తోత్రపాఠములు, భైరవుని తోకరింపులు నెరజాణవద్ద యక్కరకురాలేదు. నెరజాణకు ధనము ఎరపెట్ట దలచినాడు. ధనమార్జించుటకు మన టోపీదాసు చొల్లంగి అమావాస్యనాడు గొఱ్ఱెల మందపై తోడేలు పడినట్లు తీర్థమందాశక్తిగల పల్లెటూరు జనముపై పడినాడు. కొందరి మెళ్లలోని హారములు మాయమగుచుండెను. జడలపైనున్న బంగారు తిరుగుడు పువ్వులు ప్రాణము వచ్చినదా యన్నట్లెగిరిపోవుచుండెను. బురదలో కూరుకొని పోయిన కాళ్ల పట్టీలు బురదలోనే యంతరించుచుండెను. ఇక పిల్లలమాట చెప్పవలెనా ? చేతి బంగారు గాజులు - ఒత్తులు - ఉంగరములు మెడగొలుసులు కనురెప్పపాటులో యంతర్ధానమగుచుండెను.

ఈమహావిజయ కాలమున టోపీదాసుగారి యదృష్ట వశమున విశాఖపట్న కాపురస్థుడు రాజమండ్రి వెళ్లి టేకికల్ప కొనుటకై రెండు వేలరూపాయీలు మూట కట్టుకొని సామర్ల కోటకు వచ్చేసరికి చొల్లంగి మహాత్యం విన్నాడు దూరపుకొండలు నునుపన్నట్లు దూరదేశస్థుడు గాన పాప పరిహారము కొరకు స్నానార్థమై

డబ్బుమూట పదిలముగా చంకనిడికొని కాకినాడ తీర్థంకు వేంచేశాడు. వర్తకశిరోమణి. పల్లెవాండ్రు కొంపలవద్దకు వచ్చేటప్పటికి శక్తిబొమ్మల నెత్తి నిడికొని తాండవము సల్పుచు గొప్పజనసమర్దము మనవర్తకుని సమీపించెను. ఆ చోద్యము చూచుటకై తన రూపాయలమూటను బహు జాగరూకతతో క్రిదబెట్టి దానిపై సతిభద్రముగా కూర్చొని శక్తిబొమ్మల తాండవము తదేకనిష్టతో వీక్షించు చుండెను. మన టోపీ దాసిదివరకే యావర్తకుని వెంబడించి వచ్చు చుండెను. ఎవరిపని యెవరు మానెదరు. మూట యెగరకొట్టుటకు తనకు సమయం చిక్కనందున చింతిల్లుచు వెనుకముందాడు చుండెను. ఎంత వారికైనా కాల మనుకూలించనిదె పని నెరవేర నుగదా? అనాడు టోపీదాసు దుస్తులుగాని మతని వైఖరిగాని చూచినవారతడొక గొప్ప ఏలీనుషని ధనవంతుడని మంచిచదువరని పెద్ద ముద్యోగియని బహూకరించక మానరు. వేష భాషలకేమి కొరత. ఉన్నదంతా వేష భాషలతోనే! దిగ్విజయమునకుముందు కావలసినవి వేష భాషలే! అప్పుడు టోపీదాసు యేజమీందారు బిడ్డో యేవర్తకుని కుమార రత్నమో యేగవర్నరు ఆఫ్రిటరీగనో కనుపించు చుండెను. అంతట టోపీదాసు యిరువై రూపాయలు చేతి రుమాలం కొంగున వదులుగా మూటకట్టి మన వర్తకుని ముందునిలిచి శక్తిబొమ్మల కెప్ప వాల్పక చూచు వానివలె నటించుచు మూట విప్పి రూపాయీలు మన వర్తకునిముందు చేతి కందీ యుందని దూరము లో జారవిడిచెను. వర్తకునకు ధనమంటె ప్రీతి. అందుచేతనే వానిని ధనదేవత యాశ్రయించినది. మన విశాఖపట్టణం వర్తకునకు రూపాయీలు కళ్ల పడంగానె గంగ వెర్రులెత్తినవి. లోభదేవత ఆవేశించింది. ఆశా పిశాచము యొంటినిండా పూనింది. తన్ను తా మరచినాడు. పాపం! తన మూటమాట మరచి నాడు. అటు నిటు పరికించి చూచాడు. తన్నెవరు చూచుటలేదని నమ్మకం చూచుకున్నాడు. ఇదేసమయం అన్నాడు. తనపంట పండిందను కున్నాడు. కొంచెం ముందుకు వరిగి రూపాయీలమీద చెయ్యి వేశాడు యింతలో వెనుక సిద్ధంగా కాచియున్న భైరవుడు చప్పున ఆ మూట సంగ్రహించి శంభన్న చేతిలో పెట్టాడు. శంభన్న జంధ్యాలశాస్త్రికిచ్చాడు. కనురెప్ప పాటు కాలంలో టోపీదాసుగారి చేతిలో నా మూట వచ్చి వాలింది. వర్తకుడు వెనుక చూచుకున్నాడు. మూట యెగిరి పోవుటకు గుండెలు గుండెలు కొట్టుకొని వెర్రికేకలు వేసాడు. రొమ్ములు పగుల గుద్దుకున్నాడు. ఏడ్చుచు పోలీసువారి వైపునకు పరిగెత్తుచుండగా మన టోపీదాసు తన పరివారముతో వానిని సమీపించి ఓదార్చి ధైర్యముచెప్పి పోలీసు వారి వద్దకు తీసికొనివెళ్లి రిపోర్టుచేయించి తనపని చూచుకొన బోయెనని వింటిమి. ఇది నిజమో అల్లికో చెప్పలేము. దాసుగారి ఫస్టుక్యాంపు నిర్విఘ్నముగా సమాప్త మొందినది. రెండవ క్యాంపు యెచ్చటికో? మాకు సమాచారము వచ్చినతోడనే వెల్లడింతుము. బహుశః విశ్వవిద్యాలయముల వైపునకని ఊహించు చున్నాము. నిజం చెప్పజాలము.